# అశ్రుతర్పణం

'పద్మ - నరేశ్'

(గతసంచిక తరువాయి)

"ఏమంతకోపం? మీ ముఖంలోని విషాద గీతల్లోని కాంతి రత్నం మెరిసిపోతున్నాదే" అంది హేళనగా.

"ఏమిటి సుందరీ! ఈ రోజు హద్దుమీరి మాట్లాడుతున్నావ్."

"నా మాటలేమీ హద్దుమీరడంలేదు. మీరే ఎందుకో ఈ వేళ కోపంగావున్నారు. సరేగానీ! మీ క్లాసులో గీతారత్నం ఎవరండీ?" — నాగేష్ ముఖంలో కలవరం బయలుదేరింది.

"సుందరీ! అర్థముండే మాట్లాడుతున్నావా? మా శిక్షనులో ఆడవాళ్లు లేరన్న సంగతి నీకు తెలుసుగా!"

"అంటే మీ శిక్షనులో కాదులెండి! ఎస్. ఎస్. ఎల్. సి. లో" అన్నది.

"సుందరీ! నీ వైఖరి పూర్తిగా మారింది."

"ఆ! నా వైఖరో, మీ వైఖరో యింకా తెలుసుకోలేకుండా యున్నారు. గీతను అన్యాయం చేశారు. కాదంటారా? అప్పటినుండి ఆమె కుమిలిపోతూంది. కాళ్లమీదపడితే విదల్చేశారు. అన్యాయం చేశారు."

"సుందరీ! నీకివన్ని యెవరు చెప్పారు. వాటితో నీకు జోక్యం అనవసరం."

"ఆ! మీ మాటలు మీ తెలివి తక్కువను వ్యక్తపరుస్తున్నాయి. ఇదేనా మీ పౌరుషం. అమాయకంతో నిండివున్న వారిని అన్యాయంచేసి మూలల్లో తిరుగుతారా! మీ మగతనం యింతేనా? ఛా! మీదీ ఓ బ్రతుకేనా! మీ మాటలతో నాకు జోక్యం లేదంటారా?"

"ఆగు! నేనిక్కడికి వచ్చినప్పటినుండి నీవు మితిమీరి మాట్లాడుతున్నావు."

"నేనా! - క్షమించండి. మీరిక నాతో మాట్లాడక్కర్లేదు. మీకూ నాకూ ఈ నాటితో రుణం తీరిపోయింది."

"సుందరీ! నన్ను గురించి చెడ్డగా నీ కెవరో బాగా నూరిపోసినట్లుంది. ఆవేశంతో అర్థంతెలీకుండా మాట్లాడుతున్నావు. నేనెవ్వరికీ అన్యాయం చేయలేదు."

"చేయలేదూ పాపం! గీతారత్నం యెవరివలన చెడిందో! నేనూ మీ వలలోపడ్డాను. కానీ దైవం రక్షించాడు. ఇక మీరు దయచేయవచ్చు" అంటూ కోపంతో యింట్లోకి వెళ్లిపోయింది.

నాగేష్ యిక అక్కడ నిలువలేకపోయాడు. ఎఱ్ఱబడిన కళ్లతో చరచర సుందరి యింటినుండి వెళ్ళిపోయాడు.

## 11

మధ్యాహ్నం ఒంటిగంట. ఎండ తీవ్రంగా కాస్తుంది. నల్లత్రాచు బుసలు కొట్టినట్లు యెండవల్ల నల్లటి తారురోడ్డు భగభగ మండుతుంది. ఆ సమయంలో గీత యింట్లో ఓ వ్యక్తి అడుగుబెట్టాడు. అతని [illegible] స్వేదధార ప్రవహిస్తోంది. ఆ వ్యక్తికి బహుశా అరవై సంవత్సరాలుండవచ్చు. అతన్ని చూడటంతోటే లక్ష్మి పరుగునపోయి నాన్నా అని కౌగలించుకొని వెక్కి వెక్కి యేడ్చింది. ఎందు

తల ఏమవుతుందో అతనికేమీ అర్థంకాలేదు. లక్ష్మి అతనిని గీత గదిలోకి తీసుకెళ్ళింది. గీత మంచంమీద పడుకొనివుంది. కానీ స్మృతిలో లేదు. తండ్రి గీత నొసటిమీద చెయ్యిపెట్టిచూచాడు. సలసల కాగిపోతుంది. తలవని తలంపుగా అతని కండ్లనుండి రెండు కన్నీటి చుక్కలు కారాయి.

లక్ష్మి తండ్రి ఆజ్ఞ ప్రకారం డాక్టరును పిలుచుకొనివచ్చింది. డాక్టరు ఆమెను పరీక్షించాడు.

"డాక్టరుగారూ! నా సర్వస్వం ధారపోస్తాను. ఎలాగయినా బ్రతికించండి" అన్నాడు ఆ ముసలి.

"కాలం మించిపోయింది. ఇక దైవసహాయమే కావాలి. అయినా ఓ ఇంజక్షను యిచ్చి చూస్తాను" అంటూ ఓ యింజక్షను యిచ్చాడు.

♦ ♦ ♦

నాగేష్ పెళ్ళిపరివారంతో మరికొంతమంది స్నేహితులతో వివాహానికి తరలిపోయాడు. మూర్తిని రిత్తాన్నెన్న మాట మర్యాదకు పిలిచాడేకానీ మన మూర్తిగా పిలవలేదు. నాగేష్ వెళ్ళిన విషయం మూర్తికి ఆ సాయంత్రం తెలిసింది. అతను నాగేష్ యింటినుండి సుందరి యింటికి దారితీశాడు.

అతను సుందరి యిల్లు చేరేటప్పటికి సుందరి గీత చరిత్రను తలచుకుంటూ కాబోలు యేడుస్తూ కుర్చీలో కూర్చునివుంది.

"సుందరీ!"

"ఓ! మీరా! రండి" అంటూ కుర్చీ చూపింది.

ఇరువురి ముఖాల్లో విషాదచ్ఛాయలు పొడగడుతున్నాయి. కాసేపు యిరువురూ మౌనం వహించారు.

"గీత యెలావుంది" అని జాలిగా అడిగింది సుందరి.

"నేను వాళ్ళింటికెళ్ళి నాలుగురోజులయింది. కానీ జబ్బుతో వుందని మాత్రం విన్నాను."

"ఏం జబ్బు!"

"ఇంకేముంది? మనోవ్యాధే!"

"పాపం! మూర్తిగారూ! నేనామెను చూడవచ్చా?"

మూర్తి సుందరి కళ్ళల్లోకి చూచాడు. సుందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సుందరీ! ఏమిటది" అని ఆశ్చర్యంతో అడిగాడు మూర్తి.

"ఏమీలేదు" అంటూ పైటచెంగుతో కంటినీరు తుడుచుకుంది.

మూర్తి చాలాసేపు మౌనం వహించాడు. "సరే వస్తాను. రేపు ప్రొద్దున్నేవచ్చి మిమ్మల్ని గీత యింటికి తీసుకెళ్తాను" అంటూ మూర్తి వెళ్ళిపోయాడు. సుందరి అలాగే శూన్యాకాశంలోకి చూస్తూ వుండిపోయింది.

## 12

నాగేష్ పిఠాపూర్ చేరాడు. విడిది గృహంలో అడుగుపెట్టాడు. అది అతని స్వగ్రామ మయినప్పటికీ యిప్పుడది అత్తవారవూరు. అక్కడికి వెళ్ళిన తర్వాత తెలుసుకున్నాడు, పెళ్ళికూతురు యెవరో కాదు, తన చిన్ననాటి స్నేహితురాలు భ్రమర గీత అని.

నాగేష్‌కు అది పాతపేరు, తను చిన్నవాడు పిలిచిన పేరూ అయినప్పటికి ఈనాడెందుకో ఆ స్వరం కొంత బాధాకరంగానే తోచింది. ఒక్కసారి వెనుకకు ఆలోచించాడు. తను, గీత స్కూల్లో కలుసుకున్నారు; చెరువుగట్టున ఆడుకున్నారు. తను ఆమె వల్ల సుఖం పొందాడు. కానీ యిప్పుడు ... మరిచాడు.

భాజా భజంత్రీలు, పెళ్ళి మేళాలు మ్రోగజొచ్చాయి. అతని తండ్రి వచ్చిన అతిథులకు స్వాగతం యిస్తున్నాడు ఆనందంతో.

♦ ♦ ♦

గీత పడకమీద అంత్యదశలోవుంది. మూర్తి, సుందరీ గీత గదిలోకి కాలుపెట్టారు. మూర్తిని చూడగానే లక్ష్మి అతనివద్దకు పరుగెత్తుకొనివెళ్ళి

కౌగలించుకొని బావురుమని యేడ్చింది. లక్ష్మి కంటి నీరు మూర్తి హృదయాన్ని తడిపివేసింది. సుందరి కండ్లలోనుంచి నీటిధార ప్రవహింప జొచ్చింది.

“ఏమిటి లక్ష్మి” అని ఆదుర్దాతో అడిగాడు మూర్తి.

“అక్కయ్య చని ...”

“చనిపోయిందా ?”

లక్ష్మి చటుక్కున మూర్తి నోరు మూసింది.

“అక్కయ్యకు కడుపులో బల్ల పెరిగిపోయింది. లాభంలేదని చెప్పాడు డాక్టరు.”

మూర్తి చలించని స్తంభంలా నిలబడిపోయాడు. గీత ఎగుడు దిగుడు శ్వాసలో మునిగి తేలుతూంది. గీత తండ్రి, సుందరి, లక్ష్మి అందరూ ఆమెవట్టు దీనంగా చూస్తున్నారు.

మూర్తి, “రత్నం” అంటూ ఆప్యాయంగా పిలిచాడు దగ్గరికిపోయి. గీత పలుకలేదు. కొద్ది సేపటికి గీత యిటువైపు పొర్లింది. అందరూ ఆశగా చూచారు. మూర్తి జాలిగా డాక్టరు కండ్లలోకి చూచాడు. డాక్టరు పెదవి విరిచాడు.

“లక్ష్మీ” అన్నది మృదువుగా గీత.

“అక్కయ్యా!” అంటూ బావురుమంది లక్ష్మి.

“మూర్తి వచ్చాడా” అని అతికష్టంతో అడిగింది. మూర్తి దగ్గిరకు వెళ్లాడు.

◆ ◆ ◆

ముహూర్తం సమీపించింది.

చావు ఆసన్నమయింది.

పెండ్లి పందిరిలో ఎలక్ట్రిక్ దీపాలు నిశ్చలంగా వెలుగుతున్నాయి.

చావుగదిలోవున్న ప్రమిద మిణుకు మిణుకుమంటోంది.

“మూర్తీ! యిదేకదూ నాగేష్ పెళ్ళి సమయం!” అని మెల్లగా గొంతుక విప్పింది గీత. నాగేష్ మేళతాళాల మధ్య కూర్చుని వుంటాడు. ఆ మ్రోతలే నా హృదయాన్ని చీల్చివేస్తున్నాయి. నా యీ శరీరమే నాగేష్ భార్యరూపం తాల్చుతుంది. నా బదులు అతని భార్య నా చెల్లెలు. ఒకరి బదులు మరొకరికి సుఖం.

◆ ◆ ◆

మంత్రాలు జోరుగా చదువుతున్నాడు పురోహితుడు. ‘...కట్నపు సొమ్ము పట్రాండి బావగారూ’ అంటూ అరుస్తున్నాడు ముకుందరావు. మంగళ వాద్యాలకు పెళ్ళిపందిరి దద్దరిల్లిపోతూంది. నాగేష్ కాబోయే భార్య మెడలో మంగళసూత్రం కట్టబోతున్నాడు.

◆ ◆ ◆

గీత “మూర్తీ! లక్ష్మిని నీ ... వు అ ... న్యా ... యం ... చే ... య ... వు ... గా ...” అని అంటూ తలవాల్చింది.

అక్కడ నాగేష్ భ్రమరగీత మెడలో తాళికట్టాడు. అందరూ ఆశీర్వదించారు ఆ నూతన దంపతులను.

◆ ◆ ◆

మూర్తి గీత కళేబరంతట్టు ఓసారి దీక్షగాచూసి కండ్లు మూశాడు. అతనికి వెనుకబడిన విషయాలన్నీ జ్ఞప్తికి వచ్చాయి.

ఎంత మార్పు! అనురాగంతో ఒకప్పుడు ఆటలాడినవారే మరుక్షణంలో యీర్ష్యా సముద్రంలో యీదులాడారు కాళరాత్రిలో ఒకరు నడిసముద్రానికి, ఒకరు గట్టుకు వుద్వేత్తుగా లేస్తున్న అలలతో కొట్టబడ్డారు. ఒకరిలో ఆనందం మరొకరిలో దుఃఖం పెనవేసుకున్నాయి. లోకం ఆనందానికి పూలహారాలు తొడుగుతుంది. దుఃఖానికి రెండుకట్టెల పాన్పు వేసింది.

మూర్తి గొంతుక ఎండిపోయింది. ఆమె తన కాదర్శజీవి. లోకానికి న్యాయం చూడడానికి కళ్లు, నిజానిజాలు బయటపెట్టడానికి నోరు లేదని అప్పుడు తెలుసుకున్నాడు.

◆ ◆ ◆

లక్ష్మి, మూర్తి ఆమె సమాధికి పూలమాల లర్పించారు. సుందరికూడా తన వుడుతాభక్తిని చూపింది. ఆసమాధి దగ్గిర నిలుచుంటే వారితో ఆమె మాట్లాడినట్లే వుండేది. ప్రతీ శనివారం సంధ్య వెలుగులో ఆ ఆదర్శజీవి సమాధికి పూలువేసి ఆమె త్యాగానికి అశ్రుతర్పణంచేసి తిరిగివచ్చేవారు.